యథేచ్ఛగా జీరో దందా

జీఎస్టీ ఎగవేత

- లావాదేవీలకు లెక్కా పత్రం లేదు
- విక్రయాలన్నీ తెల్ల కాగితాలపైనే..
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

పొన్నూరు: వంద రూపాయలతో మెడిసిన్ కొన్నా.. రూ. వెయ్యితో దుస్తులు కొన్నా.. రూ.లక్ష వెచ్చించి బంగారం కొనుగోలు చేసినా అధికారిక రశీదులు ఉండవు. అంతా తెల్లకాగితాల పైనే.. లేదంటే నంబర్లు లేకుండా ఇన్వాయిస్ పేరుతో ప్రచురించిన బిల్లును దర్జాగా ఇచ్చేస్తారు. ఇలా ఏడాదికి రూ.కోట్లలో వ్యాపారం జరుగుతున్నా, సర్కిల్ పరిధిలోని జీఎస్టీ అధికారులకు పట్టడం లేదు. దుస్తులు, బంగారం, కిరాణా, మెడికల్, ఎరువులు, ఫర్నీచర్, స్టీల్, సిమెంట్, ఐరన్, ఫ్యాన్సీ.. ఇలా ఏ వస్తువు కొనుగోలు చేసినా తెల్లకాగితంపై నాలుగు గీతలు గీసి ఇవ్వడం వ్యాపారులకు రివాజుగా మారింది. రోజువారీ వ్యాపారానికి ఎలాంటి లెక్కా పత్రం ఉండదు. నెలవారి మామూళ్లకు అలవాటు పడిన కొందరు అధికారుల వైఖరి కారణంగా అంతా జీరో దందా సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



బంగారం కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

విక్రయాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

వస్తు సేవ పన్ను (జీఎస్టీ) కేంద్రం అమల్లోకి తెచ్చింది. ఇందులో నాలుగు స్లాబులుగా 5, 12,18, 28 విభజించింది. ప్రతి డీలర్ ఆన్‌లైన్‌లో ఆ వివరాలను నమోదు చేయాలి. ఈ విధానం ద్వారా వ్యాపారంలో పారదర్శకత పెరిగి జీరో దందాకు చెక్ పడుతుండటంతోపాటు ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని కేంద్రం భావించింది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా వాణిజ్య పన్నుల శాఖ నిలుస్తోంది. కానీ వినియోగదారులకు జీఎస్టీ బిల్లులు ఇవ్వకుండా కొందరు వ్యాపారులు పన్నులు ఎగ్గొడుతున్నారు. సాధారణంగా వాణిజ్య సంస్థలు పన్నుల శాఖ నుంచి అనుమతులు పొంది నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, చాలామంది వ్యాపారులకు ఈ అనుమతులు లేవనేది అక్షర సత్యం. అనుమతులు ఉన్నవారు తెల్లకాగితాలపై లావాదేవీలు నిర్వహిస్తూ పన్నుల పరిధిలోని రాకుండా జాగ్రత్త పడుతున్నారు. జీఎస్టీ డీలర్లు సైతం అత్యధికంగా వినియోగదారులకు బిల్లులు ఇవ్వడంలేదని తెలుస్తోంది. రూ.200 పైబడిన ప్రతి లావాదేవీ జీఎస్టీ ఇన్వాయిస్, బిల్ ఆఫ్ సప్లై కింద పరిగణనలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి రూ. 50 వేలు విలువ గల లావాదేవీ బిల్లు పరిధిలోకి రావాల్సి ఉండగా, రూ. 49 వేలు రాసి బిల్లులేకుండా ఇన్వాయిస్‌లతో జీఎస్టీకి ఎగనామం పెడుతున్నారు. రూ. 20 లక్షలలోపు లావాదేవీలు ఉన్న వ్యాపారులు పన్ను పరిధి నుంచి మినహాయింపు ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని విక్రయాలకు లెక్కలు చూపడంలేదు. దీనిపై అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడింది.

మామూళ్ల మత్తులో అధికారులు

లావాదేవీలు ఎక్కువగా జరిపి రికార్డుల్లో నమోదు చేయని కొందరు వ్యాపారులను గుర్తించి వారి నుండి కొందరు అధికారులు మామూళ్లకు అలవాటు పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ. 20 లక్షల పైబడి టర్నోవర్ గల వ్యాపారులు వందల సంఖ్యలో ఉన్నప్పటికీ ఆశించిన లావాదేవీలు రికార్డుల్లో చూపడం లేదని సమాచారం. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణ వ్యాప్తంగా జీరో దందాకు మార్గం సుగుమం అవుతోంది. అయితే వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వ్యాపార, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనల ప్రకారం వ్యాపారాలు జరుగుతున్నాయో లేదో పరిశీలించాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఇవేం జరగడంలేదని తెలుస్తోంది.

ఆదాయానికి గండి

పట్నంబజార్ సర్కిల్ పరిధిలోని పొన్నూరులో సుమారు 800 మంది వ్యాపారులు జీఎస్టీ పరిధిలో ఉన్నట్లు సమాచారం. వీరిద్వారా నెలకు సుమారు రూ. లక్షల్లో ఆదాయం ప్రభుత్వానికి రావాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదాయానికి గండి పడుతోంది. జీరో వ్యాపారానికి కళ్లెం వేసేందుకు జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చినా అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్టపడటం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పొన్నూరులో అక్రమ లావాదేవీలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

ఓటు ప్రాధాన్యతను యువత గుర్తించాలి



పొన్నూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2025 జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారు, ఇప్పటి వరకు ఓటు లేనివారు ఫారం– 6 ద్వారా తమ ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. పట్టణంలోని పీబీఎన్ కళాశాలలో స్వీప్(ఎన్నికల భాగస్వామ్యం) కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యత, ఎన్నికల్లో భాగస్వామ్యం, ప్రజాస్వామ్యంలో యువత ఆవశ్యకత, ఓటు ఎలా నమోదు చేసుకోవాలి అనే అంశాలపై వివరించారు. ఓటు ప్రాధాన్యతను యువత గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు పాల్గొన్నారు.

ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోకూడదని, సకాలంలో కొనుగోలు చేసే విధంగా రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పొలాల వద్ద ఆరబోసిన ధాన్యం పాడవకుండా వెంటనే మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ మద్దతు ధర రైతులకు అందే విధంగా చూడాలని తెలిపారు. సమావేశంలో డీటీ రాజా రమేష్, ఎంఏఓ డేగల వెంకట్రామయ్య, వీఆర్‌ఓలు, మిల్లర్లు పాల్గొన్నారు.

నూరు శాతం ఇంటింటి సర్వే చేయాలి

కాకుమాను:ఇంటింటి సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది త్వరితగతిన నూరు శాతం పూర్తి చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి(డీఎల్‌డీవో)సుజాత తెలిపారు. మండలంలోని అప్పాపురం,రేటూరు గ్రామ సచివాలయాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించి, ప్రతి రోజూ సర్వే చేయాలని ఆదేశించారు.గ్రామంలోని గృహాలు, నివాసితులు, ఓటర్ల గురించి సర్వేలో పూర్తి స్థాయిలో సేకరించాలని సూచించారు. విధి నిర్వహణలో శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రవిబాబు, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ అంధకారం



పెదకాకాని: ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే భవిష్యత్ అంధకారమవుతుందని జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ పి. రేవతి తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరం బీడీఎస్ విద్యార్థులకు గురువారం ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతి మాట్లాడుతూ ర్యాగింగ్ సంఘటనలను నిరోధించడంలో, నివేదించడంలో విద్యార్థులు, అధ్యాపకులు కీలక పాత్రలను పోషించాలని తెలిపారు. కళాశాలలో భయం లేకుండా నివేదించే సంస్కృతిని ప్రోత్సహించాలని సూచించారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిబార్ డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి. వెంకట రమణారెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.జె. సాయిశంకర్ పాల్గొన్నారు.

అధిక కేసులు పరిష్కారానికి సహకరించాలి



పొన్నూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో డిసెంబరు 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించేలా బార్ అసోసియేషన్ సభ్యులు సహకారం అందించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి ఎం. అంజనీ ప్రియదర్శిని కోరారు. బార్ అసోసియేషన్ సభ్యులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు పరిధిలోని క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీమార్గం ద్వారా పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. జయరాజ్, న్యాయవాదులు ఎం.ఈరేసు, కె. సుబ్బారావు, టి. రమేష్, పి. విజయ్‌కుమార్, జి. అంకమ్మరావు పాల్గొన్నారు.

స్వశక్తితో విద్యార్థులంతా ఎదగాలి



గుంటూరు రూరల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకుని, స్వశక్తితో ఎదిగి పరిశ్రమల స్థాపన దిశగా పయనించి పది మందికి ఉపాధి కల్పించాలని గ్రేడ్– 1 మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఏ విధంగా ఎదగాలి అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన స్కీమ్స్‌ను ఎంఎస్ఎంఈకి అందజేస్తే వారికి కావాల్సిన పెట్టుబడి పొందవచ్చని తెలిపారు. నమ్మకం, పట్టుదల, కష్టపడేతత్వం పెంపొందించుకోవాలని సూచించారు. చిన్న పరిశ్రమలు స్థాపించి పదిమందికి ఉద్యోగాలను అందించవచ్చని, సమాజాభివృద్ధికి దోహదపడవచ్చని తెలిపారు.. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ చందు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం



పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కిరణ్‌కుమార్, పార్టీ నేతలు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించిన అంబటి మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే 134వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి అంబటి మురళీకృష్ణతో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. పూలే ఆశయ సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునందించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వెనుకబడిందని, వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, పార్టీ నాయకులు షేక్ నాజర్, ఆకుల వెంకటేశ్వరరావు, ఎండేటి వెంకట సుబ్బయ్య, షేక్ మాము, గేరా సంజీవ్, మూర్తిరాజు, దేవరకొండ గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు పూలే కృషి

గుంటూరు రూరల్: సమ సమాజ స్థాపనకు మహాత్మా జ్యోతిరావ్ పూలే చేసిన కృషి ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోగల ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు ఉచిత విద్య, మహిళల కోసం మొట్టమొదటి పాఠశాలను ఏర్పాటు చేయటం వంటి సాహసోపేతమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మేధావి పూలే అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్యాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

- కార్యాలయంలో నియోజకవర్గంలోని నాయకులతో కిరణ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. తన దృష్టికి వచ్చిన అంశాలపై స్పందించి, అన్ని విధాలా సహకారాలు అందిస్తామని చెప్పారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకసానుభూతి

పెదనందిపాడు మండలం వరగాని చెక్‌పోస్ట్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై కిరణ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అకాల మృత్యువాతకు గురైన తూమాటి శ్యాంసన్, దేవరపల్లి జాన్‌ల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



పూలే చిత్రటానికి నివాళులు అర్పిస్తున్న గేరా మోహనరావు తదితరులు

అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు.

సామాజిక విప్లవమూర్తి పూలే

కాకుమాను:ఆధునిక సామాజిక విప్లవ మూర్తి జ్యోతిరావ్ పూలే అని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు.పెదనందపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గేరా మాట్లాడుతూ సమాజంలో కుల వివక్షత, అంటరానితనంపై నిరంతరం పోరాటం చేసి వెనుకబడి,బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావ్ పూలే అని ఆయన కొనియాడారు. దేశంలో మహిళల గౌరవం కాపాడిన గొప్ప వ్యక్తి పూలే అని ఆయన తెలిపారు. ఆయన్ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, మేడిద రవి, ఆనందరావు, మంజుల, వంశీ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: అనారోగ్యంతో మానసిక ఒత్తిడికి లోనై వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్ పేట 4/2 వ లైన్ ప్రాంతానికి చెందిన శ్రావణి (28), చెన్నారెడ్డికి 12 సంవత్సరాలు క్రితం వివాహమైంది. చెన్నారెడ్డి ఎక్సైజ్ విభాగం ల్యాబ్‌లో పని చేస్తారు. పాప, బాబు ఉన్నారు. అయితే, కొంత కాలంగా శ్రావణి అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కుటుంబ సభ్యులకు భారం అవుతున్నానని చెబుతూ బాధపడేది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహ్యత చేసుకుంది.

కేస్ డైరీ ప్రిపేర్ చేయడం నేర్చుకోండి



గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎస్పీ మల్లికార్జునరావు

ప్రత్తిపాడు: గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు(జీఎంఎస్‌కేలు) కేస్ డైరీ ప్రిపేర్ చేయడం నేర్చుకోవాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ పి. మల్లికార్జునరావు తెలిపారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సీఐ జి. శ్రీనివాసరావు, ఎస్ఐ కె. నాగేంద్రలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

మీరు పిల్లర్స్ లాంటి వాళ్లు..

గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులే పోలీస్ శాఖకు అండ అని డీఎస్పీ అన్నారు. స్థానిక ఠాణాలో డీఎస్పీ వారితో మాట్లాడారు. గతంలో గ్రామ స్థాయిలో సమాచారం చెప్పేందుకు ఎవ్వరూ ఉండేవారు కాదని, ఇప్పుడు మీరంతా ఉన్నారని తెలిపారు. మీరు పిల్లర్ల లాంటి వారని, పిల్లర్లు పటిష్టంగా ఉంటేనే భవనం గట్టిగా నిలబడుతుందని పేర్కొన్నారు. మహిళల మిస్సింగ్‌లు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు కదలికలతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి పోలీసులకు వెంటనే తెలియజేయాలని కోరారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో ఒక్కొక్కరు పది సీసీ కెమెరాలు గ్రామాల్లో ఏర్పాటు చేయించాలని, అందుకు స్థానిక స్టేషన్ సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. కేస్ డైరీలు ప్రిపేర్ చేయడం వలన భవిష్యత్ బాగుంటుందని వివరించారు. గ్రామానికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు అందించడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని చెప్పారు.

గన్నీ బ్యాగుల నగదు జమ కావడం లేదు

తహసీల్దార్‌కు మొరపెట్టుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఏవో

ప్రత్తిపాడు: రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని తహసీల్దార్ జి. కరుణకుమార్ అన్నారు. మండల పరిధిలోని వంగిపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏవో అరుణ కుమారితో కలిసి ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట సాగు, దిగుబడుల వివరాలతో పాటు ధాన్యం కొనుగోళ్లలో సమస్యల గురించి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించిన సొమ్ము సక్రమంగానే ఖాతాలకు జమ అవుతుందని, అయితే గన్నీ బ్యాగుల డబ్బులు మాత్రం అవ్వడం లేదని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రైతుల నుండి కనీస మద్దతు ధరకు నాణ్యతను బట్టి వ్యాపారులు కొనుగోలు చేయాలని సూచించారు. ఏవో అరుణకుమారి మాట్లాడుతూ సాధారణ రకం ధాన్యాన్ని రూ. 2,300, ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని రూ. 2,320కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

యువత చేతుల్లోనే దేశ భవిత



యువ ఉత్సవ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: యువత చేతుల్లోనే దేశ భవిత ఉందని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కళాశాలలో గురువారం క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, గుంటూరు నెహ్రూ యువ కేంద్ర, కిట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో యువ ఉత్సవ్– 2024 కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ యువతలోని నైపుణ్యాలను బయటకు తీసేందుకు యూత్ ఫెస్టివల్స్ ఉపకరిస్తాయని చెప్పారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి డి. కిరణ్మయి మాట్లాడుతూ నేటి తరం యువత అన్ని రంగాల్లో పోటీపడాలన్నారు. ప్రిన్సిపాల్ పి. బాబు మాట్లాడుతూ యువత ప్రశ్నించే గుణం అలవరచుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. కిట్స్ కళాశాల సెక్రటరీ కె. శేఖర్ మాట్లాడుతూ యువఉత్సవ్ కార్యక్రమంతో యువతలో దాగున్న ప్రతిభను వెలికితీయవచ్చని తెలిపారు. తొలుత వికసిత భారత్– 2047 అంశంపై యువతకు పెయింటింగ్, రైటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ, ఉపన్యాస, యువ సంవాదంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కె.చంద్రారెడ్డి, ఈవెంట్ కో–ఆర్డినేటర్ పి.సరళ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో పాలిమర్‌ల పాత్ర కీలకం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సీవీ అవధాని, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తదితరులు

చేబ్రోలు: జీవశక్తితో సులభంగా కరిగే పాలిమర్‌లను అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చునని పూణెలోని సోమయ్య విద్యావిహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీవీ అవధాని పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ' పై మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ కాన్ఫరెన్స్ గురువారం ప్రారంభమైంది. ప్రొఫెసర్ సీవీ అవధాని మాట్లాడుతూ పాలిమర్ సైన్స్, టెక్నాలజీ రంగం ఎన్నో విధాలుగా ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. మెడికల్ ఫీల్డ్‌లో ఉపయోగించే పాలిమర్స్ మన్నికైన ఔషధ డెలివరీ వ్యవస్థల అభివృద్ధికి, మెరుగైన సర్జికల్ పరికరాల అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. కేరళ సెయింట్ బెర్చ్‌మన్స్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ రెంజిత్ థామస్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయో పాలిమర్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. భువనేశ్వర్‌లోని ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ కె.వి జయకృష్ణ మాట్లాడుతూ నానో పాలిమర్‌లు చిన్న పరమాణు స్థాయిలో రూపొందించి అధిక నాణ్యత కలిగిన వస్తువులను సృష్టించేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. మెడికల్ డయాగ్నోస్టిక్స్, క్యాన్సర్ చికిత్స, ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీలలో వినియోగిస్తున్నారన్నారు. హైదరాబాద్ ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవీఐటీ పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు



పెదకాకాని: కళాశాల నిరంతరం అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు వీవీఐటీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం (వీవీఐటీ అల్యుమినీ కనెక్ట్)ను విద్యార్థులు ఏర్పాటు చేసినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 2011 నుంచి కళాశాలకు చెందిన వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు ఈ వీవీఐటీ అల్యుమినీ కనెక్ట్ ఉపయోగపడుతుందని అన్నారు. పూర్వ విద్యార్థులనుంచి వచ్చిన సూచనల మేరకు కళాశాల విద్యా సంబంధిత కార్యక్రమాలు క్యాంపస్‌లో నిర్వహించు సాంకేతిక పోటీలను మెరుగుపడచడంలో ఉపయోగపడుతాయన్నారు. వీవీఐటీ విద్యార్థులు సమాజశ్రేయస్సుకు దోహదపడాలని సూచించారు. అనంతరం వీవీఐటీ అల్యుమినీ కనెక్ట్ బ్రోచర్‌ను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, వీవీఐటీ పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఆవిష్కరించారు.

విద్యార్థులను ఎన్ఏఎస్ పరీక్షలకు సిద్ధం చేయాలి

కొమ్మూరు(కాకుమాను): డిసెంబర్ 4న జరగనున్న ఎన్ఏఎస్(నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే)పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈవో కె.ఎఫ్. కెనడీ ఉపాధ్యాయులకు తెలిపారు. మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు గురువారం ఎన్ఏఎస్‌పై అవగాహన కార్యక్రమం నిరర్వహించారు.ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ వచ్చే నెల ఆరో తేదీన విద్యార్థులకు సైన్స్ ,సోషల్ ,లెక్కలపై ఎన్ఏఎస్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు ఇప్పటి నుండే విద్యార్థులకు పరీక్షల్లో ప్రతిభ కనబరిచే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా పరీక్షల్లో తీసుకోవాల్సిన అంశాల గురించి విద్యార్థులకు వివరించారు.